కూటమి ప్రభుత్వం మాట నిలబెట్టుకోవాలి



కూటమి ప్రభుత్వం అధికారం లోకి వస్తే చదువుకుని నిరుద్యోగులైన యువతీయువకులకు నిరుద్యోగ భృతి ఇస్తానన్న హామీ నిలబెట్టుకోవాలి. ఉద్యోగ అవకాశాలు లేక తల్లిదండ్రులకు భారమవుతున్నాం. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే వరకూ నిరుద్యోగ భృతితో ఆదుకోవాలి.

- బత్తిన లోవరాజు, నిరుద్యోగి, జొన్నలగరువు

సూపర్ సిక్స్ అని చెప్పి ఇప్పుడు భయమేస్తుందా?



ఎన్నికల సమయంలో అనేక హామీలిచ్చి అధికారం చేపట్టిన సీఎం చంద్రబాబు ఇప్పుడు సూపర్ సిక్స్ అంటే భయమేస్తోందనడం ఆశ్చర్యానికి గురి చేసింది. ఏటా మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితమన్న కూటమి ప్రభుత్వం ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదు. అమాయక ప్రజలకు అబద్ధపు హామీలిచ్చి ఇప్పుడు సూపర్ సిక్స్ పథకాల అమలును వాయిదాలు వేసుకుంటూ వస్తున్నారు.

- తాడి కస్తూరి, నాగంపేట, పెద్దాపురం పట్టణం, కాకినాడ జిల్లా

నెలకు రూ.1,500 ఎప్పుడిస్తారు?



ఎన్నికల సమయంలో 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు 1,500 ఇస్తామని హామీ ఇచ్చారు. తీరా ఇప్పుడు ఆ హామీ నెరవేరుస్తారో లేదో కూడా చెప్పడం లేదు. మాట దాట వేస్తూ పథకం ప్రారంభించడంలో జాప్యం చేస్తున్నారు. మహిళలను మభ్య పెట్టడానికే ఈ పథకం ప్రకటించారా అన్న సందేహం కలుగుతుంది.

- సూతి అరుణ, గృహిణి, చదలాడ, పెద్దాపురం మండలం

తల్లికి వందనం కోసం ఎదురు చూపులు



అధికారంలోకి రాగానే తల్లికి వందనం పేరుతో ఇంట్లో ఎంత మంది పిల్లలున్నా అందరికీ రూ.15,000 చొప్పన ఇస్తామని కూటమి నేతలు ఎన్నికల ప్రచారంలో చెబితే నమ్మాం. మా పిల్లలిద్దరికీ ప్రభుత్వం నుంచి సాయం అందుతుందని అనుకున్నాం. విద్యా సంవత్సరం ప్రారంభమై 50 రోజులు అవుతున్నా తల్లికి వందనం ఇవ్వలేదు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జూన్ నెలలోనే అమ్మ ఒడి సొమ్ము బ్యాంకు ఖాతాలో పడేది.

- కర్రి వెంకటలక్ష్మి, గృహిణి, సామర్లకోట

రైతు భరోసా ఊసే లేదు




గతంలో జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ రైతు భరోసా పేరుతో రైతులకు రూ.13,500 ఆర్థిక సహాయం అందజేసేవారు. కూటమి నేతలు ఎన్నికల సమయంలో రైతులకు రూ.20 వేలు ఇస్తామని ప్రకటిస్తే నిజమనుకున్నాం. పెద్దాపురం నియోజకవర్గంలో 50 శాతం వరి నాట్లు పూర్తయినా ఇప్పటివరకూ ప్రభుత్వం నుంచి రైతులకు ఆర్థిక సాయం ప్రకటనే లేదు. ప్రభుత్వం ఎన్నికలకు ముందు హామీ ఇచ్చినట్లుగా సూపర్ సిక్స్ పథకాలు అమలుచేయాలి.

- ఇంటి వెంకట్రావు, రైతు, వీకే రాయపురం, సామర్లకోట మండలం

బాబు ష్యూరిటీ.. లేని గ్యారంటీ

ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితం



నియోజకవర్గాల వారీగా లబ్ధిదారులు

పెద్దాపురం	70,000 మంది
పిఠాపురం	89,000 మంది

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం



నియోజకవర్గాల వారీగా లబ్ధిదారులు

పెద్దాపురం	1,20,000 మంది
పిఠాపురం	1,28,900 మంది

- ఎన్నికలకు ముందు అరచేతిలో వైకుంఠం చూపించిన చంద్రబాబు
- హామీలన్నీ ఎప్పటి నుంచి అమలు చేస్తారంటూ ప్రశ్నిస్తున్న ప్రజలు
- తేల్చి చెప్పకుండా కాలయాపన చేస్తున్న 40 ఇయర్స్ ఇండస్ట్రీ

పిఠాపురం: 'ఇంటింటికీ ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, ఇంటికో ఉద్యోగం లేదా యువతకు నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి, తల్లికి వందనం పేరుతో ఇంటింటా బడికి వెళ్లే పిల్లలు ఇంట్లో ఎంత మంది ఉంటే అంతమందికి రూ.15 వేలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ప్రతి రైతుకి ఏడాదికి రూ.20,000 సాయం, ప్రతి మహిళకు నెలకు రూ.1,500 ఇస్తాం' ఇది బాబు ష్యూరిటీ అంటూ ఎన్నికల్లో టీడీపీ నేతలు ఊదరగొట్టారు. ఈ హామీలన్నీ బూటకమని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 50 రోజుల్లోనే తేలిపోయింది. అధికారంలోకి రాగానే తాము ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేస్తామని ప్రచారం చేసిన చంద్రబాబు గద్దెనెక్కాక ప్రజలను మళ్లీ మోసం చేయడానికి ఫిక్స్ అయ్యారని నిర్ధారణ అయిపోయింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని సాకుగా చూపిస్తూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కాలని చూస్తున్న టీడీపీ నిజ స్వరూపం కొద్ది రోజుల్లోనే బయటపడింది. ఎన్నికల్లో హామీలు ఇవ్వడం తీరా అధికారంలోకి వచ్చాక వాటిని పక్కన పాడేయడం సీఎం చంద్రబాబుకు కొత్తేమీ కాదు. మరోసారి తాము మోసపోయామని ప్రజలకు అర్థం కావడంతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేదని ఎన్నికల ముందు బాబోరికి తెలియదా అంటూ ప్రశ్నిస్తున్నారు. పిఠాపురం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచి డిప్యూటీ సీఎం హోదాలో ఉన్న పవన్‌కల్యాణ్ ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు ఎప్పటి నుంచి అమలు చేస్తారో చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. 2019 ఎన్నికలకు ముందు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలన్నీ ఎన్నికల్లో గెలిచాక తూచా తప్పకుండా అమలు చేశారని గుర్తు చేసుకుంటున్నారు.



చేయలేని వారు ఎందుకు చెప్పారు



ఇచ్చిన హామీలు అమలు చేయడం కూటమి ప్రభుత్వ బాధ్యత. పథకాల అమలుపై మంత్రుల ప్రకటనలు నిరాశ కలిగిస్తున్నాయి. హామీలు ఇచ్చేటప్పుడే ఇవ్వగలమా లేదా అనేది చూసుకోవాలి. అంతే తప్ప ఇచ్చాకా మాట మార్చకూడదు. అమలు చేయలేనప్పుడు ఎందుకు హామీలు ఇచ్చారో ప్రజలకు సమాధానం చెప్పాలి. మా అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేయగలిగినవే చెప్పారు. చెప్పిన దానికంటే ఎక్కువ చేసి చూపించారు. అంతేగాని చేయలేని వాటిని చెప్పి ప్రజలను మోసం చేయలేదు. కాని ప్రస్తుత ప్రభుత్వ నేతలు ఇస్తామని చెప్పి చేతులెత్తేస్తున్నారు. సూపర్ సిక్స్ అంటూ విస్తృత ప్రచారం చేశారు. బాబు ష్యూరిటీ అన్నారు. ఇవన్నీ ఏమయ్యాయి. ఇప్పుడు ప్రజలకు ఏ ష్యూరిటీ ఇస్తారో ప్రభుత్వం చెప్పాలి.

- వంగా గీత, మాజీ ఎంపీ, పిఠాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్



జగన్ పాలనలో ఐదేళ్లలో రైతులకు అందిన సాయం

పథకం	నియోజకవర్గం	లబ్ధిదారులు	ఐదేళ్లలో లబ్ధి
రైతు భరోసా	పెద్దాపురం	14,800 మంది	రూ.11.45 కోట్లు
	పిఠాపురం	12,413 మంది	రూ.8.84 కోట్లు

జగన్ పాలనలో ఐదేళ్లలో తల్లులకు అందిన సాయం


పథకం	నియోజకవర్గం	లబ్ధిదారులు	ఐదేళ్లలో లబ్ధి
అమ్మ ఒడి	పెద్దాపురం	25,944	రూ.301.68 కోట్లు
	పిఠాపురం	12,378	రూ.159.96 కోట్లు

జగన్ పాలనలో జగనన్న విద్యాదీవెన పథకంలో విద్యార్థులకు అందిన సాయం

నియోజకవర్గం	విద్యార్థులు	లబ్ధి
పెద్దాపురం	3200 మంది	రూ.45.64 కోట్లు
పిఠాపురం	4003 మంది	రూ.57.68 కోట్లు

జగన్ పాలనలో జగనన్న వసతి దీవెన పథకంలో విద్యార్థులకు అందిన సాయం

నియోజకవర్గం	విద్యార్థులు	లబ్ధి
పెద్దాపురం	2,400 మంది	రూ.19.43 కోట్లు
పిఠాపురం	3,946 మంది	రూ.27.06 కోట్లు



కూటమి పాలనలో ఒక్కో ఏడాదికి రైతులకు అందాల్సిన సాయం

పథకం	నియోజకవర్గం	లబ్ధిదారులు	ఇవ్వాల్సిన మొత్తం(ఏడాదికి)
అన్నదాత సుఖీభవ	పెద్దాపురం	14,800 మంది	రూ.29.60 కోట్లు
	పిఠాపురం	12,510 మంది	రూ.25.02 కోట్లు



టీడీపీ పాలనలో ఒక్కో ఏడాది తల్లులకు అందాల్సిన సాయం

పథకం	నియోజకవర్గం	లబ్ధిదారులు	ఇవ్వాల్సిన మొత్తం(ఏడాదికి)
తల్లికి వందనం	పెద్దాపురం	35,000	రూ.52.50 కోట్లు
	పిఠాపురం	12,390	రూ.18.58 కోట్లు



యువతకు నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి

నియోజకవర్గం	నిరుద్యోగులు	ప్రతి నెలా ఇవ్వాల్సిన సాయం
పెద్దాపురం	35,000 మంది	రూ.10.50 కోట్లు
పిఠాపురం	55,900 మంది	రూ.16.77 కోట్లు



మహిళలకు ప్రతి నెలా 1500

నియోజకవర్గం	లబ్ధిదారులు	ఇవ్వాల్సిన సాయం
పెద్దాపురం	1,09,294	రూ.16.39 కోట్లు
పిఠాపురం	1,14,819	రూ.17.22 కోట్లు

క్లుప్తంగా

ఉచిత పశు వైద్య శిబిరం



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ సూర్యప్రకాశరావు

పిఠాపురం: రాష్ట్రీయ గోకుల్ మిషన్ సౌజన్యంతో గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో పశు సంవర్థక శాఖ, పశు గణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఇందులో వివిధ రకాల గర్భకోశ వ్యాధులకు పరీక్షలు నిర్వహించారు. చూడి పశువులకు మినరల్ మిక్చర్లు, ఎదకు రాని పశువులకు మందులు, దూడలకు నట్టల నివారణ, నులి పురుగుల నివారణ మందులు, లివర్ టానిక్‌లు, హార్మోన్ ఇంజెక్షన్లు ఇచ్చారు. శిబిరంలో 25 ఆవులకు, 80 గేదెలకు మందులు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో సంయుక్త సంచాలకుడు డాక్టర్ సూర్యప్రకాశరావు మాట్లాడుతూ, ఉచిత వైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమానికి సహాయ సంచాలకుడు డా.ఎం శ్రీనివాసరావు, డాక్టర్లు కల్యాణి, హిమజ ప్రశాంత్ సేవలందించారు.

నవరాత్రి దీక్షల విరమణ



దీక్షను విరమిస్తున్న పీఠం ఆరాధకులు

పెద్దాపురం: స్వయంభూ తొలి తిరుపతి శృంగార వల్లభ స్వామి ఆలయంలో కాకినాడ భోగి గణపతి పీఠం ఆరాధకులు పది మంది బుధవారం గణపతి నవరాత్రి దీక్షలను విరమించారు. పీఠం ఉపాసక గురుస్వామి దూసర్లపూడి రమణరాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఏటా పీఠంలో గణపతి దీక్ష చేపట్టి, ఆ దీక్షను చారిత్రక దేవాలయంలో విరమణ చేశామని తెలిపారు.

బొజ్జ గణపయ్యా.. వెళ్లి రావయ్యా..

- ఘనంగా వినాయకుని నిమజ్జనాలు
- కళకళలాడిన సాగర తీరం

కొత్తపల్లి: గణపతి నవరాత్రుల ముగింపు సందర్భంగా ఉప్పాడ సాగర తీరం గణనాథుని నిమజ్జనాలతో బుధవారం కళకళలాడింది. సుమారు 250కి పైగా విగ్రహాలను భక్తులు సాగరంలో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా వేలాది మంది భక్తులు పుణ్యస్నానాలను ఆచరించారు. మండలంలోని కొత్తపల్లి, వాకతిప్ప, కొండెవరం, యండపల్లి, కోనపాపపేట తదితర గ్రామాల్లో ఉన్న వినాయక విగ్రహాలను మేళతాళాలు, బాణసంచా కాల్పులతో గ్రామాల్లో ఊరేగించారు. ఉప్పాడ సముద్ర తీర ప్రాంతానికి మండలం నుంచే కాకుండా, పిఠాపురం, గొల్లప్రోలు, సామర్లకోట తదితర మండలాల నుంచి విగ్రహాలను లారీలు, ట్రాక్టర్లు, ఆటోలపై వినాయక ప్రతిమలను ఊరేగింపుగా తరలించి నిమజ్జనం చేశారు. తీరంలో గణనాథునికి ప్రత్యేక హారతులిచ్చి, పూజలను నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్సై వెంకటేష్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు. సందర్శకుల తాకిడితో బీచ్ రోడ్డు కిక్కిరిసిపోయింది.



కొత్తపల్లిలో నిర్వహిస్తున్న గణపతి విగ్రహ ఊరేగింపు

భారీ అన్న సమారాధనలు

గణపతి నవరాత్రుల ముగింపు సందర్భంగా మండలంలో బుధవారం భారీ అన్న సమారాధనలు నిర్వహించారు. ఉప్పాడ శివారు అనంతలక్ష్మీ కాలనీ, కొత్తపల్లిలో రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన లక్ష్మీగణపతి మందిరం వద్ద భారీ అన్న సమారాధనలు జరిగాయి. భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు.

కొనసాగుతున్న గణేశ్ నిమజ్జనాలు

సామర్లకోట: గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఆయా శిబిరాల వద్ద అన్నదానాలు, నిమజ్జన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఈ నెల ఏడున వినాయక చవితిని పురస్కరించుకుని గణపతి ఆలయాల్లో, ఆయా శిబిరాల వద్ద గణపతి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉత్సవాలు ముగియడంతో స్థానిక రైల్వే స్టేషన్ సెంటర్‌లో పండ్ల వర్తకులు ఏర్పాటు చేసిన శిబిరం వద్ద మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేసి, సాయంత్రం గణేశ్ విగ్రహ నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. నిమజ్జన కార్యక్రమాలను పురస్కరించుకుని స్థానిక ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ఏర్పాటు చేసిన శిబిరం నుంచి సంప్రదాయ సంగీత, నృత్య కార్యక్రమాలతో ఊరేగింపు నిర్వహించారు. పట్టణంలో ఏర్పాటు చేసిన ఏకైక ఆరు అడుగుల మట్టి విగ్రహమిది. దీంతో ఊరేగింపులో గణపతి విగ్రహాన్ని భారీగా భక్తులు దర్శించుకున్నారు. ఇండస్ట్రియల్ ఎస్టేట్, మెహర్ కాంప్లెక్స్, మఠం సెంటర్, స్టేషన్ సెంటర్, ఫ్లై ఓవర్ బ్రిడ్జి మీదుగా నిమజ్జన ప్రదేశానికి చేరే వరకు దారి పొడవునా నిమజ్జన నిర్వాహకులు భక్తులకు ప్రసాద వితరణ చేశారు. సామర్లకోట, పెద్దాపురం మున్సిపాలిటీల పరిధిలో ఏర్పాటు చేసిన విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై ఉంచి, పంచారామ క్షేత్రం వద్ద ఉన్న గోదావరి కాలువ రేవు వద్ద నిమజ్జనం చేశారు. అదే విధంగా పీబీ దేవం, జి.మేడపాడు, వేట్లపాలెం, హుస్సేన్‌పురం, వీకే రాయపురం, మాధవపట్నం గ్రామాల్లో ఆయా గోదావరి కాలువ రేవుల్లో విగ్రహాలను నిమజ్జనం చేశారు. చంద్రంపాలెం, నవర, పవర గ్రామాల్లో విగ్రహాలను ఏలేరు కాలువలో నిమజ్జనాలు చేశారు. సీఐ ఎ.కృష్ణ భగవాన్ ఆధ్వర్యంలో ఆయా నిమజ్జన ప్రదేశాల్లో బందోబస్తు ఏర్పాట్లు చేశారు. వైద్యారోగ్య, రెవెన్యూ సిబ్బంది పర్యవేక్షించారు.



సామర్లకోట గోదావరి కాలువలో క్రేన్ సాయంతో నిమజ్జనం చేస్తున్న గణపతి మట్టి విగ్రహం



వాకతిప్ప నుంచి విగ్రహాన్ని నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు



సామర్లకోటలో గణేశ్ నిమజ్జన ఊరేగింపు



కొత్తపల్లిలో నిర్వహిస్తున్న అన్న సమారాధన

పంచారామ క్షేత్రంలో పౌర్ణమి పూజలు

సామర్లకోట: భాద్రపద మాసం పౌర్ణమిని పురస్కరించుకుని స్థానిక పంచారామ క్షేత్రంలో బుధవారం పౌర్ణమి పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. స్వామివారు, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఉంచి, ఆలయం చుట్టూ ఊరేగింపు నిర్వహించారు. పూజల అనంతరం స్వామివారిని, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. ఈఓ భళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, సన్నిధిరాజు వెంకన్న, చెరుకూరి రాంబాబు, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, వినయ్ పూజాది కార్యక్రమాలు చేశారు. భక్తులకు ప్రసాద వితరణ, భోజన ఏర్పాట్లు చేశారు.

పంచారామ క్షేత్రంలోని స్వామివారు



పరిసరాల పరిశుభ్రత

సామర్లకోట: ప్రధాని మోది జన్మదినం సందర్భంగా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా బుధవారం స్థానిక అయోధ్య రామపురం బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ సమీపంలో పరిసరాలను శుభ్రం చేశారు. పెద్దాపురం నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి గొరకపూడి చిన్నయ్యదొర ఆధ్వర్యంలో హెచ్‌ఎం తోటకూర సాయిరామకృష్ణ, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.



రోడ్లను శుభ్రం చేస్తున్న నాయకులు

లడ్డూ వేలం పాట

సామర్లకోట: గణేశ్ ఉత్సవాల సందర్భంగా స్థానిక వీర్రాఘవపురంలోని గణపతి శిబిరంలో బుధవారం సాయంత్రం లడ్డూ వేలంపాట నిర్వహించారు. ఐదు కేజీల లడ్డూకు వేలం నిర్వహించగా, వేమవరపు కృపారాణి రూ.5 వేలకు దక్కించుకున్నారు.

పాటదారుకు లడ్డూ అందజేస్తున్న నిర్వాహకులు



'మాతృత్వం' సేవలు అభినందనీయం



బృందాన్ని అభినందిస్తూ భోజనం వడ్డిస్తున్న ఎస్సై

పెద్దాపురం: గర్భిణుల కోసం మన పెద్దాపురం ఫేస్‌బుక్ టీం చేస్తున్న సేవలు అభినందనీయమని ఎస్సై మౌనిక అన్నారు. స్థానిక ఏరియా ఆస్పత్రి వద్ద ప్రతి బుధవారం గర్భిణులకు అందించే ఆహార పంపిణీ (మాతృత్వం) కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, యువత ఇటువంటి సంస్థలను ఆదర్శంగా తీసుకుని, మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. టీం అడ్మిన్ నరేష్ పెదిరెడ్డి మాట్లాడుతూ, 26వ వారం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ వారం లూథరన్ హైస్కూల్ 2006–07 టెన్త్ బ్యాచ్ సహకారంతో సుమారు 150 మంది గర్భిణులకు భోజన సౌకర్యం కల్పించామన్నారు. అనంతరం గర్భిణులకు మాతృత్వం పౌష్టికాహారాన్ని ఎస్సై మౌనిక ప్రారంభించారు. టీం సభ్యులు లక్ష్మణ్ దివాకర్, నవీన్ నాని, రాజేష్‌కుమార్, రాఘవ, జయశ్రీ, లక్ష్మి, రత్నం తదితరులు పాల్గొన్నారు.

బీచ్ రోడ్డుపైనే వ్యాపారం



అమీనాబాద్ సెంటర్‌లో చేపలను విక్రయిస్తున్న మహిళలు

కొత్తపల్లి: ఉప్పాడ–కోనపాపపేట బీచ్ రోడ్డులోని అమీనాబాద్ సెంటర్‌లో చేపల వ్యాపారం జోరుగా సాగుతోంది. ఉదయం, సాయంత్రం మత్స్యకార మహిళలు రోడ్డుపైనే చేపలను విక్రయిస్తున్నారు. స్థానికంగా ఉన్న మార్కెట్‌కు కేటాయించిన స్థలాన్ని విడిచిపెట్టి చేపల వ్యాపారులు ప్రైవేటు స్థలంలో, నడి రోడ్డుపైన వ్యాపారాన్ని నిర్వహిస్తున్నారు. దీంతో కొనుగోలుదారులతో రోడ్డు కిక్కిరిసిపోతోంది. వాహనాల రాకపోకలు నిలిచిపోతున్నాయి. గంటల తరబడి ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. వాహన చోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.